ఇండియా టుడే : ఏప్రిల్ 2003

# వసంత నారాయణ

ఆ ఇంటికి చూరుంది. చూరుకు గూనపెంకు కప్పి ఉంది. కప్పిన గూనపెంకు అక్కడక్కడా తప్పుకుంది. ఆ చూరు కింద ఎన్ని కలలు ఉద్భవించాయో, ఉద్భవించిన కలలన్నిటిలో ఎన్ని సాఫల్యత చెందాయో తెలీదు.

ఇప్పుడు మాత్రం కలలు కనీ కనీ అలసిన ఓ ప్రాణి. ఇప్పుడిప్పుడే రెక్కలిప్పుకుంటున్న చిరుత కలల గుంపులాంటి ఇంకో చిరుప్రాణి. అలసిన కలల ప్రాణి అమ్మ. ఓ ముప్ఫై ఏళ్ళుంటాయి.

కానీ, కాలం కరుకుగా ఆమెను ఒరుసుకుంటూ కనికర రాహిత్యంతో కదిలిపోయిన ఛాయలు స్పష్టంగా; అనారోగ్యం, అకాల వార్ధక్యం జమిలిగా ఆమెమీద దాడి చేసిన, చేస్తున్న దాఖలా బహిరంగంగా; ముతక నేత రంగు వెలిసిన చీర, ఎప్పుడో ఆమె ఒంటికి బిగుతుగా అతుక్కునుండీ, ఇప్పుడు శుష్కించిన శరీరాన్ని లోపల ధరించిన వదులు రవికె; రేపటి మీద నమ్మకం, ఆశా సన్నగిలిన నిర్లిప్త నేత్రాలూ, తన అస్తిత్వంతోపాటు దారిద్ర్యపు అస్తిత్వం కూడా సహజమేననుకున్న స్థితప్రజ్ఞత; నైరాశ్యానికీ; అనారోగ్యానికీ, చీకటికీ, దారిద్రానికీ సంకేత చిత్రంలా ఆమె ఉంటే...

తద్భిన్నంగా రెక్కలిప్పుకుంటున్న కలల గుంపును కప్పుకున్న చిరుత ప్రాణి ఆమె కూతురు. ఆకాశాల్లాంటి కళ్ళు, కారుమబ్బుల్లాంటి జుట్టూ, హేమంతపు మంచు ఉదయాన, మసక మంచు పొగను చీల్చుకు వచ్చే నులివెచ్చటి సూరీడులాంటి, ఊగే రెల్లుపూల మీది మంచు బిందువుల్లాంటి, మామిడి తోరణంలాంటి, మరుమల్లెల దండలాంటి, అసలు ప్రకృతే ఒళ్ళు విరుచుకు లేచినట్టుండే చిర్నవ్వుతో ఆ పాప. పేరు వసంత. వయసు ఎనిమిది వసంతాలంత.

* * *

ఆ ఊరు ఆంధ్రప్రదేశంలో ఓ మారుమూల పల్లె. ఓ రెండొందల గడప, ఓ

పాడుబడ్డ గుడి, గుడికటువేపున చిన్న చెరువు, ఆ చెరువు నిండా వసంత నవ్వుల్లాంటి కలువలు, గుడికిటువేపున వసంత వాళ్ల ఇల్లు.

ఆ వూళ్లో చిన్న బడుంది. అందులో నేనుంటాను. ఆ వూరికి పోస్టాఫీసు లేదు. పోస్ట్‌మన్ నారాయణ వారానికో మాటొస్తాడు. అయిదు మైళ్ళ దూరాన్నించి సైకిలు మీద.

వసంత వాళ్ళిల్లు గుడికి దగ్గరగా ఊరికి కాస్త ఎడంగా ఉండడానికి కారణం? తనకున్న మిగిలిన పావు ఎకరా నేలలో తాను వయసులో ఉన్నప్పుడు వసంత నాన్న చిన్న తోట పెట్టుకున్నాడు. మల్లెలూ, కనకంబరాలూ, బంతిపూలూ, చేమంతులు పెంచుకుంటూ, వాటి సంరక్షణార్థం అక్కడే ఉండేందుకనువు చేసుకున్నది కావడమే...

ఇప్పుడు వసంత నాన్న లేడు. వసంతనడిగితే, "కొత్త రైలెత్తుకుపోయింది నాన్నని" అంటుంది.

వసంత తల్లినడిగితే, "పూలమ్మడం కన్నా డబ్బులెక్కువస్తాయని నగరానికెళ్ళాడు" అంటుంది.

ఊళ్ళోవాళ్లనడిగితే, "పిచ్చి సంగడు హాయిగా పూలమ్ముకు బతికేవోడు. పెద్దరైల్లో జెనాలన్చూసి నగరంలో డబ్బుల మూటలుంటాయనుకొనెళ్లి అక్కడ ఓటెల్లో అన్నాలొడ్డిస్తున్నాడు పిచ్చెదవ" అనంటారు.

కానీ, నెలకో యాభయ్యో, అరవయ్యో శాంతమ్మకి డబ్బు మాత్రం నగరం నించి మనియార్డరు పంపిస్తాడు. సంగడు తవ్వుకున్న నుయ్యి ఎండిపోయింది. మల్లె పొదలు అయిదో ఆరో మిగిలాయి.

ఇంటి ముందు మాత్రం మందారం మహోద్ధృతంగా పెరిగింది. ఇటువేపున పారిజాతం చెలరేగిపోయింది. పాతకాలపు రాగి కానీల్లా పారిజాతపు విత్తులు గమ్మత్తుగా వసంతనలరిస్తాయి. నేలమీద వెన్నెల్లా కురిసిన పారిజాతాలు వసంత నవ్వుల్లా ఉంటాయి.

★ ★ ★

నన్నా ఊరికి టీచరుగా వేశారు. సింగిల్ టీచర్ స్కూలది. పిల్లలకిష్టమయితే పాఠాలు వింటారు. అసలు పాఠాలు వినని పిల్లలు వసంత, యానాది బుంగోడు, మతి స్తిమితం సరిగా లేని చిన్న షబ్బీర్.

చిన్న షబ్బీర్‌కు ముందు వరసలో పై పళ్ళూ, కింది పళ్ళూ వుండవు. ఓ నవ్వు ఘనీభవించి వాడి ముఖానికతుక్కుని ఉంటుంది. వాడి కళ్ళు పుసులోడుతుంటాయి. వాడికి బట్టలు కూడా సరిగా ఉండవు.

ఈ మనసుకు నచ్చని విషయాల్ని అధిగమింప జేసేది వాడి బోసి నవ్వే. చొంగ కారితే చేతి మడమతో తుడుచుకుంటాడు. ఇక యానాది బుంగోడు సరేసరి. పైన

చొక్కా లేకుండా, జారిపోతున్న లాగుకు ఓ పురికొస బెల్టు కట్టుకుని, ఎండిపోయిన రొట్టె తెచ్చుకుని ముక్క ముక్కా కొరుకుతూ, నములుత్తా కూచునుంటాడు. బయటికి వెళ్ళాలనిపిస్తే లేచెళ్ళిపోతాడు. సభ్యా సభ్యతలూ, మర్యాదామర్యాదలు వీటి మధ్య విచక్షణ లేని నైర్మల్యం...

చిన్న షబ్బీర్‌కు అక్షరాలు కూడా నేర్పించలేని అశక్తత నామీద నాకు కోపాన్ని తెప్పిస్తుంది. వాడింట్లో ఉంటే ఇల్లు పీకి పందిరేస్తాడని వాళ్ళ నాన్న పెద్ద షబ్బీర్ స్కూల్లో వదిలేస్తాడు. అతను చిన్న చిన్న చెక్కపనులు చేసుకుంటుంటాడు. చిన్న షబ్బీర్ స్కూల్లో కూచోడానికి కారణం వసంత, బుంగోడు.

వాళ్ళిద్దరూ కాక నే చెప్పే చిన్న చిన్న కథలు... బుంగోడు తెలివైనవాడు. అక్షరాలు నేర్చేసుకుని గుణింతాలకొచ్చాడు. కానీ, వాడికిష్టమైతేనే రాస్తాడు. వసంత వీళ్ళిద్దరికీ లీడరు. దానికి వాక్యాలు రాయడం వచ్చేసింది. అదీ అంతే. దానికిష్టమైతే "చెప్పు రాస్తా" అంటుంది.

నేను ఊళ్ళోకి రావాలంటే మెయిన్ రోడ్డుమీద బస్సు దిగి నడచిరావాలి లేదా ఎవరైనా ఊళ్ళోవాళ్ళు సైకిలుమీదొస్తుంటే వెనకాలెక్కి రావాలి. అదీ కాకపోతే ఎవరిదేనా ఎద్దుల బండి.

ఈ యాతన కంటే ఊళ్ళోనే ఉండడం మేలనిపించింది. పైగా ఒంటరివాణ్ణి. ఎప్పుడు పడిపోతుందో తెలీని ఆ గూడు ఉదయం బడి తర్వాత నా విడిది. ఓ ట్రంకు, రెండు సత్తు బొచ్చెలూ, ఓ కిరోసిన్ స్టవ్వూ నా ఆస్తి.

నెలకోమా టెళ్ళి జీతం తెచ్చుకొనేవాడిని. బళ్ళో పిల్లలు ఓ ఇరవైదాకా ఉన్నా, నాకిష్టులు ముగ్గురే. వసంత, బుంగోడు, చిన్న షబ్బీర్.

ఊళ్ళోవాళ్ళు నన్ను ప్రేమగా చూసుకుంటారు. పాడుబడిన గుడి పూజారి భార్య వాళ్ళింటి ముందునుంచి ఎప్పుడెళ్ళినా, 'నాయినా ఈ కూర పట్టుకెళ్ళు' అని ఓ బాదాం ఆకులో ఏదో ఆదరపు ఎత్తి నాచేతిలో వేస్తుంది. ఒక్కరనేమిటి, ఊరు ఊరంతా నాకన్నం పెట్టేవాళ్ళే.

అయినా నాకు యానాది బుంగోడు తాటాకులో చుట్టితెచ్చే కాల్చిన మాంసం ముక్కలంటే చచ్చే ఇష్టం. 'ఇదో చియ్యిలు మాయమ్మిచ్చింది' అని తెచ్చేవాడు. వాళ్ళందరూ కాక వారానికో మాటు అతిథిగా వచ్చే పోస్ట్‌మాన్ నారాయణ నాకు మంచి మిత్రుడు.

పట్టుమని పది ఉత్తరాలు కూడా ఉండవు. అయినా ప్రతి బుధవారం క్రమం తప్పకుండా నెమ్మదిగా సైకిలు తొక్కుతూ వస్తాడతను. అతన్నడిగితే వయసు యాభైయారేళ్ళంటాడు. చూట్టానికి అరవై అయిదేళ్ళవాడిలా కనిపిస్తాడు.

అతను వారంలో మూడు పల్లెలు తిరుగుతాడు. అతనికీ, నాకూ అనుబంధం ఏర్పడ్డానిక్కారణం, అతను నాలాగే ఒంటరే.

భార్య చనిపోయింది, కూతురూ చనిపోయింది. 'చచ్చిపోయే ధైర్యంలేక బతుకుతున్నా పంతులూ' అంటాడు.

ఊళ్ళోకొచ్చిన్రోజున నాదగ్గరే భోజనం చేస్తాడు. సాయంకాలం కొద్దిగా చల్లబడ్డాక ఆ పాత సైకిలెక్కి వెళ్ళిపోతాడు. వెళ్తూ వెళ్తూ ఊళ్ళో నన్నూ, ఇంకో ముగ్గురు నలుగుర్నీ 'ఏమైనా తేవాలా?' అనడుగుతాడు. ఎవరైనా ఏమైనా కావాలని అడిగితే, అతను మళ్ళీ వచ్చేరోజున తెచ్చి పెడ్తాడు.

★ ★ ★

వసంత ప్రతిరోజు ఉదయాన్నే ఆ రోజుకి పూచిన పువ్వుల్ని తీసుకుని గుడికెళ్ళి పూజారికిస్తుంది వాళ్ళమ్మ పనుపున, కానీ పువ్వుల్తో పాటు చిన్న షబ్బీర్ని, యానాది బుంగోడినీ వెంట తీసుకెళ్తు,ది. పూజారికి ప్రతిరోజు ఇదో తలనొప్పి.

"ఆ తురకవాణ్ణి, యానాది వెధవనీ గుళ్ళోకి తీసుకురాకే, ఒరేయ్ మీరు బయట ఉండండిరా" అనరుపు. కానీ, పసి వసంతకి పువ్వుల కన్నా విలువైన వాళ్ళు దాని స్నేహితులు.

"ఏమొస్తే" అని పూజారిని నిలదీస్తుంది.

"వాళ్ళు గుళ్ళోకి రాకూడదే పిచ్చిముండా" అంటాడు పూజారి.

"మరి నువ్వు లోపలున్నావే సామి దగ్గరా?" అని దబాయిస్తుంది వసంత.

ఆ నైర్మల్యానికి పూజారి దగ్గర సమాధానముండదు. "వెళ్ళండి వెళ్ళండి త్వరగా" అని తరిమేస్తాడు.

నాకు దేముడూ గీముడూ జాన్తానై. గుళ్ళో ప్రశాంతంగా ఉంటుందని వెళ్ళి అప్పుడప్పుడు కూచుంటాను. ఓ రోజు సాయంకాలం వెళ్ళి కూచున్నా. పూజారి ఏవో మాటలు చెబుతూ ఉన్న కాస్త ప్రశాంతతకి భంగం కలిగిస్తున్నాడు.

ఇంతలో చెరువులో కలువలు కోసుకోడానికొచ్చిన వసంత, దాని ఇద్దరు సైనికులు నన్ను చూశారు. లోపలికి పరిగెత్తుకుంటూ వచ్చేశారు. వచ్చి మెట్లమీద కూచుని, "కత చెప్పూ కత చెప్పూ" అనరిచింది వసంత.

బంగోణ్ణి, షబ్బీర్ని తరమాలనుప్చుశాడు పూజారి. వాళ్ళా వెళ్ళేది. ఏమి చేయలేక నిస్సహాయంగా చూస్తూ గర్భగుళ్ళోకెళ్ళిపోయాడు పూజారి. అక్కడ కూచునే నే చెబ్తున్న కథని తానూ ఆసక్తిగా వింటున్నాడు.

అంతలో ఓ గొప్ప విశేషం జరిగిపోయింది. మతిస్తిమితం లేని షబ్బీర్ నిక్కరు పైకెత్తి సర్న ఒంటికి పోసేశాడు గుడి మెట్లమీంచే.

పూజారి పరిగెత్తుకుంటూ వచ్చి గన్నేరు కొమ్మను విరిచి వాణ్ణి కొట్టడానికొచ్చాడు. అడ్డు పడ్డాను.

అతనికి చెప్పాను. "అయ్యా! వాడికి మతిస్తిమితం లేదు. ఇదే గుడిమెట్ల మీదా, ధ్వజస్తంభం మీదా కాకులూ, పిట్టలూ రెట్టలేస్తుంటాయి. ఆ పక్షులకీ, వీడికీ భేదం లేదు. అమాయకత్వం. ఈ పని చేయొచ్చు, చేయకూడదూ అన్న విచక్షణ లేని పసివాడు. వదిలేయండి నేను కడుగుతాను" అన్నాను.

ఏమనుకున్నాడో ఏమో పూజారి గన్నేరు కొమ్మ పక్కకి పారవేశాడు. పూజారి ఏమీ అనకుండా మిన్నకుండేసరికి యానాది బుంగోడికి రౌడీ బుద్ధి పుట్టింది.

నిక్కరు పైకెత్తి గుండ్రంగా తిరుగుతూ వాడూ ఉచ్చ పోసేశాడు. వసంత 'హే' అని నవ్వుతూ చప్పట్లు కొట్టింది.

అప్పుడు పూజారి పారవేసిన గన్నేరు కొమ్మ తీసుకుని నేను వాడి వెంటపడ్డాను. పిల్లలు దొరకుతారా! చెరువు గట్టంటా పరిగెత్తించారు ముగ్గురూ కలిసి.

ఆయాసం వచ్చి రొప్పుతూ, "రేపు బడికి రండి మీ తాట తీస్తా" అని అసహాయంగా అరిచా. కానీ రాత్రి పడుకుని ఆ సంఘటన తలుచుకుంటే నవ్వు తన్నుకు వచ్చింది.

★ ★ ★

నాకు రానురానూ ఈ ముగ్గురు పసివాళ్ళతోటి అనుబంధం బలపడసాగింది. ఓ రెండ్రోజులు ముగ్గుర్లో ఎవరు కనబడకపోయినా నేనే వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళే పరిస్థితి వచ్చేసింది.

ఓ మాటు బుంగోడు రెండ్రోజుల్రాలేదు బడికి. వెతుక్కుంటూ వెళ్ళా యానాది గూడేనికి.

తాటితోపు అవతల ఉంది గూడెం. అయిదారు చిన్న పాకలు అంతే. పందులూ, కోళ్ళూ, కుక్కలూ అటూ ఇటూ తిరుగుతుంటే వాటి మధ్యనే చిన్న పిల్లలు బట్టల్లేకుండా, తైల సంస్కారాలు లేని తలల్తో, పుసులోడుతున్న కళ్ళతో, కారుతున్న ముక్కుల్తో తిరుగుతుంటారు. కొందరేడు స్తుంటారు, కొందరు సత్తు కంచాల్లో అన్నం పెట్టుకు తింటుంటారు, కొందరాడుకుంటుంటారు.

బుంగోడి తండ్రి యానాది పోగోడు. వాకబు చేస్తే తాటితోపులోనే తూర్పు మూల ఉన్నాడన్చెప్పారెవరో. బుంగోడికేమైందని అడిగితే, వచ్చిన సమాధానం విని నివ్వెరపోయాను.

కల్లు తాగి పడిపోయాడట. వాడేమిటి కల్లు తాగడమేమిటి? నిండా ఎనిమిదేళ్ళు లేవు. విసురుగా తాటితోపులోకెళ్ళాను. తూర్పు మూల నలుగురు కూచుని ఉన్నాడు. ఒకడు కల్లుకుండ పట్టుకుని పోస్తుంటే ఒకడొకడూ తాటాకు దొన్నెతో ఆబగా

కల్లు తాగుతున్నారు. పిలిచినా పలికే స్థితిలో లేరు. దగ్గరికి వెళదామా వద్దా అని జంకుతూ దూరంగా తాటిచెట్టుకానుకుని నించున్నా.

బుంగోడి తండ్రి పోగోడు లేచి చిందులేయడం మొదలు పెట్టాడు. ఆఁ ఆఁ.. శీ కిశ్నా యద్దు... బూ... శెనా... నా... నా... ఆఁ...

శి... కి... శ్నా యద్దు... శి... కి... శ్నా... శి... కి... శ్నా... అని దబ్బున పడిపోయాడు.

వాడిని పట్టించుకోకుండా మిగిలినవాళ్ళు తాగుతూనే ఉన్నారు. నాకు తెలుసు కాసేపాగి వాళ్ళు కూడా పడిపోతారు.

నిస్సహాయంగా వెనుదిరిగా. తర్వాత్తెలిసింది. యానాది గూడెంలో ఆడా మాగా, పిల్లా ముసలీ అందరూ తాగుతార్ట.

మరుసటిరోజున బుంగోడు బడికొచ్చినప్పుడు అడిగితే, "నువ్వు తాగవా?" అనాశ్చర్యపోయి అడిగాడు వాడు.

అయినా వాడికర్థమయ్యేట్టు, నాకు తెలిసిన విధంగా నచ్చజెప్పాను. కానీ, వాడికి సయించినట్టు లేదు నా మాటలు.

★ ★ ★

ఆ రోజున పోస్టమన్ నారాయణ వచ్చినవాడు మామూలుగానే సాయంకాలం దాకా ఉన్నాడు. పెద్ద షబ్బీర్ ఇంట్లో కోడి పులావ్ చేశారని తెచ్చిచ్చాడు.

నేనూ టౌన్లోకొస్తానుండమని నారాయణకి చెప్పాను. ఉక్కపోతగా ఉంటే చెరువులో స్నానం చేసి వద్దామని నేనూ, నారాయణా చెరువుకు వెళ్ళాం. నడుములకు తుళ్ళు కట్టుకుని చల్లటి చెరువు నీళ్ళలోకి దిగాము. నారాయణ ఏవో మాటలు చెబుతున్నాడు. పూజారి గట్టుమీంచి నడుస్తూ గుడికెళ్తూ మమ్మల్ని పలకరించి వెళ్ళాడు. చెరువు గట్టుకిటు గేదెలు గడ్డి మేస్తున్నాయి.

ఇంతలో ముగ్గురు రౌడీలు వసంత, బుంగోడు, చిన్న షబ్బీర్‌లు ప్రత్యక్షమయ్యారు.

వసంత లంగాని గోచీలాగా చెక్కుకుంది. బుంగోడు, షబ్బీర్ ఇద్దరూ కలిసి దాన్నో గేదెనెక్కించారు. అది కేరింతలు కొడుతోంది.

నేనూ నారాయణ నవ్వుకుంటున్నాము వాళ్ళని చూసి. బుంగోడు రెల్లును పీకి షబ్బీర్కి కొంతిచ్చి తను కొంత చేత్తో పట్టుకుని గేదెని వెనక నుంచి రెల్లుతో కొట్టసాగాడు. గేదె చిన్నగా కదలసాగింది.

ముగ్గురి కేరింతలు ఎక్కువయ్యాయి. అకస్మాత్తుగా గేదె పరుగందుకుంది. పిల్లల కేరింతలు. గేదె బెదిరిందన్న సంగతి నాకు, నారాయణకీ అర్థమైపోయింది.

"ఒరేయ్, ఒరేయ్" అనరుస్తూ మేం వాళ్ళ వెంటపడ్డాం. చూస్తుండగానే ఘోరం

జరిగిపోయింది. వసంత గాల్లోకెగిరిపడింది. గేదె దాన్ని కాళ్ళతో తొక్కుతూ పారిపోయింది.

ఒక్కసారి నిశ్శబ్దం. నేను, నారాయణా వెళ్ళేసరికి వసంత అపస్మారకంగా పడుంది. బాగా గాయాలయ్యాయి. తలనించి విపరీతంగా రక్తం స్రవిస్తోంది.

వసంతనెత్తుకుని భుజాన వేసుకున్నా. నారాయణ గాబరాగా నా వెనక వచ్చాడు. బుంగోడు షబ్బీర్ భయపడిపోయారు.

వసంత తల్లి గొల్లుమంది గబగబా గాయాలు కడిగి రక్తం కారుతున్న తలకి బట్టకట్టేసరికి వసంత కళ్ళు తెరించింది.

జరిగింది గ్రహింపు రావడానికి కొద్ది సమయం పట్టింది. గ్రహించింతర్వాత బోరుమని ఏడవసాగింది.

నారాయణ సైకిలు నేను తొక్కుతుంటే, అతను వసంతను ఎత్తుకుని క్యారియర్ మీద కూచున్నాడు.

శక్తినంతా వెచ్చించి సైకిలు త్వరగా తొక్కి తాలూకా హాస్పిటల్ని చేరుకునేసరికి ఓ గంటైంది.

వసంత కళ్ళు మూతలు పడుతున్నాయి. అర్థమైంది ఒంట్లో రక్తం చాలా మటుకు వెళ్లిపోయిందని. హాస్పిటల్లో డాక్టరుంది. చూడగానే బల్లమీద పడుకోబెట్టి తలకైన గాయానికి కుట్లు వేసింది. మిగిలిన గాయాలకి తగిన చికిత్స చేసి, "పాపకు రక్తం ఎక్కించాలండీ. చూస్తాను ఇక్కడే దొరికితే ఫరవాలేదు. లేదూ మీరెవరైనా ఇవ్వాలి" అంది. తలూపాము.

"మా ఇద్దరి రక్తం సరిపోకపోతే!" నారాయణతో అదే సందేహం వెలిబుచ్చాను.

"ఫర్వాలేదు ఇక్కడ నాకు తెల్సినవాళ్ళు చాలామందున్నారు" అని ధైర్యం చెప్పాడు నారాయణ.

మాకిబ్బంది కలక్కుండా రక్తం హాస్పిటల్లోనే దొరికింది. డాక్టరు ఫర్వాలేదని చెప్పింతర్వాత ఊపిరి పీల్చుకున్నాం.

హాస్పిటల్ ఆవరణలో వేపచెట్టు కింద కూచున్నాం. నారాయణ సిగరెట్ వెలిగించాడు. "భగవంతుడా పాపను కాపాడు. భర్తా పోయి, బిడ్డా పోతే ఆ పిచ్చితల్లి తట్టుకోలేదు." బహిరంగంగానే గొణిగాడు నారాయణ.

వసంత తండ్రికిప్పుడైనా తెలియజేయాల్సిన అవసరం ఉందనుకుని, "నారాయణా! నీకు వసంత నాన్న ఎక్కడుంటాడో తెల్సుకదా. అతనికి తెలియజేద్దాం" అన్నాను.

నారాయణ ఓ వెర్రి నవ్వు నవ్వి ఊరుకున్నాడు. నేను రెట్టించాను. ఇక తప్పదన్నట్టు చెప్పసాగాడు నారాయణ.

"పంతులూ, నీకో సంగతి చెబుతాను ఎవరికీ చెప్పకు. నాకు నిజంగా ఆ సంగడు ఎక్కడున్నాడో తెలీదు. మరి నెలనెలా మనియార్డరు తెచ్చిస్తున్నావే అని నువ్వడగొచ్చు. అదో దొంగ మనియార్డరు. ఆ పిచ్చితల్లికి ఎక్కణ్ణించీ మనియార్డరు రాదు. నీకో సంగతి చెబుతా. నా భార్య మరణం తర్వాత నేను నా కూతురు దగ్గిరే ఉండేవాణ్ణి. నాకో మనవరాలు. అచ్చు మన వసంతలాగే ఉండేది. నా అల్లుడూ సంగడిలాగే ఓ రోజు చెప్పా పెట్టకుండా ఇల్లొదిలెల్లిపోయాడు. ఓ మూణ్ణెల్లు చూసి, ఓ రోజున నా తల్లి తన కూతుర్ని తీసుకుని నూతిలో దూకేసింది." నారాయణ కళ్ళలోంచి ధారగా నీళ్ళు కారుతున్నాయి.

మిగిలింది నారాయణ చెప్పకుండానే అర్థం చేసుకున్నాను. నా పక్కన కూచున్న నారాయణ ముందు మరుగుజ్జులాగా అనిపించాను. లేచి నిలబడి రెండు చేతులూ జోడించి ఆ మహానుభావుడికి నమస్కరించాను.

❃